పదికి ప్రణాళిక సిద్ధం

- పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో పరీక్షలకు హాజరు కానున్న 2,733 మంది విద్యార్థులు



గుడిబండ: విద్యార్థుల బంగారు భవితకు తొలి మెట్టుగా పదో తరగతిని భావిస్తారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎన్నుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదో తరగతి మార్కులు కీలకం. దానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఎప్పటికప్పుడు ఎసైన్‌మెంట్లు, మాక్ టెస్టులు పెడుతూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రథమ స్థానంలో నిలిపేందుకు...

పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విద్యాశాఖ పంపించిన నూతన టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్ తీసుకొచ్చింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో ఉన్న 58 ప్రభుత్వ పాఠశాలల్లో 2,733 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

మండలం	పాఠశాలలు	పదో తరగతి విద్యార్థుల సంఖ్య
అగళి	8	358
అమరాపురం	11	567
రొళ్ల	10	390
గుడిబండ	12	528
మడకశిర	17	890
మొత్తం	58	2,733

విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఇలా...

- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షల నిర్వహణ
- ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి తృతీయ స్థానంలో ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయింపు
- రోజూ ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు
- రోజుకో సబ్జెక్ట్ వంతున వారానికి 7 సబ్జెక్టుల బోధన
- సమ్మేటివ్–1 పరీక్షలు తాజాగా జరగగా.. జనవరి లేక ఫిబ్రవరి మొదటి వారంలో సమ్మేటివ్-2 పరీక్షలు జరగనున్నాయి.

ప్రత్యేక తరగతులతో మేలు



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు మరింత సమయం చదుకునే అవకాశం కలుగుతోంది. మాకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షలు బాగా రాసి మంచి స్కోరును సాధిస్తాను.

– ఎమ్.ఎస్ జనని, జెడ్పీ హైస్కూల్, గుడిబండ మండలం

సిలబస్ రివిజన్ చేస్తున్నారు



ఉపాధ్యాయులు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ రివిజన్ చేస్తున్నారు. ఇక్కడ తోటి విద్యార్థులతో పోటీపడి బాగా చదువుతున్నాను. నాకు గణితం, ఇంగ్లిష్ అంటే బాగా ఇష్టం. ప్రత్యేక తరగతుల ద్వారా ఆ రెండు సబ్జెక్టులతో పాటు, మిగితా సబ్జెక్టులలో మరింత పట్టు సాధిస్తున్నాను.

– నందిని, ఏపీ మోడల్ స్కూల్, అగళి మండలం

ప్రణాళిక అమలు చేస్తున్నాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల యాక్షవ్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు బయపడకుండా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

– రవిచంద్రన్, ఎంఈఓ–2 గుడిబండ

క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

లేపాక్షి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ సూచించారు. శనివారం ఉదయం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో గ్రీటింగ్‌లు వద్దు..బొకేలు వద్దు..కేకులు వద్దు..శీతల పానీయాలు వద్దు..మొక్కలే ముద్దు..మొక్కలు ఇచ్చి 2025 నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు తెలియజేద్దామనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు ఉపాధ్యాయులకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు జయనాయక్, ప్రిన్సిపాల్ నాగరాజు, సుధాకర్, అంబురాజన్, రాధారెడ్డి, వన్నూరు వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రొద్దంలో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్ర

రొద్దం: పావగడ–పెనుకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తే జరిమానా తప్పదని ఎస్‌ఐ నరేంద్ర అన్నారు. శనివారం రహదారిపై ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దుకాణాలు, వాహన దారులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన దుకాణదారులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కేవీ నాగరాజు, హోం గార్డు శివకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మల్లికార్జున తండ్రి నాగప్ప అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర శనివారం ఉదయం గ్రామాన్ని సందర్శించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రామాంజనేయులు, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవులు, కొండలరాయుడు, మూర్తి, నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం



బాధితులకు పరిహారం అందిస్తున్న జపానంద స్వామీజీ

పావగడ: తాలూకాలోని హరిహర పుర గ్రామం దళితవాడలో ఇటీవల సిలిండర్ పేలిన ఘటనలో గుడిసెలు దగ్ధమయ్యాయి. శనివారం స్థానిక రామకృష్ణ సేవాశ్రమం అధిపతి జపానంద స్వామీజీ సంఘటన స్థలానికి చేరుకున్నారు. దగ్ధమైన గుడిసెల ఆనవాళ్లను పరిశీలించారు. బాధితులు దొడ్డణ్ణ, భూతమ్మ, మనువరాళ్లు తిప్పమ్మ, శ్వేత, ఇద్దరు చిన్న పిల్లలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం నిత్యావసర సురుకులు, వస్త్రాలు, ఉలన్ దుప్పట్లు, టార్పాల్, వంట సామగ్రిని బాధితులకు అందించారు.

నాణ్యత లోపిస్తే సహించం



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి.. రుచికరంగా ఉందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని భోజన ఏజెన్సీ నిర్వాహకుడిని ఆదేశించారు. అధికారులు కూడా భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే సహించబోమని హెచ్చరించారు. ఎంఈఓ భాస్కర్‌తో సమావేశమై పాఠశాలలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సమస్యలను పరిష్కరించాలని హెచ్ఎం, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కోరారు.

అర్హులకు మినీగోకులం షెడ్లు మంజూరు చేయాలి



మినీగోకులం షెడ్లపై అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: మినీగోకులం షెడ్లను అర్హులకు మంజూరు చేయాలని జెడ్పీటీసీ అనంతరాజు అధికారులను కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. మండల స్థాయి అటవీ, హార్టికల్చర్, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, పశువైద్యశాఖతో పాటు ఇతరాత్ర శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశానికి కనీసం మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా వారి కింది స్థాయి అధికారులు మాత్రమే హాజరవుతున్నారని మండిపడ్డారు. ప్రధాన సమస్యలు చర్చించడానికి కింది స్థాయి అధికారులకు అవగాహన లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి ఉందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలు ఏమాత్రం పరిష్కరం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పశువైద్యశాఖ, ఉపాధి హామీ పథకం అనుసంధానంగా మండలానికి 46 మినీగోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో షెడ్డు విలువ నిర్మాణాన్ని బట్టి రూ.2.20 లక్షల వరకు నిధులు కేటాయించారు. పాడి ఆవులు ఉన్న రైతులకు మాత్రమే మినీగోకులం షెడ్లను మంజూరు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అధికారులు మాత్రం పాడి ఆవులు లేకున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులకు కట్టబెట్టారని నిలదీశారు. ముఖ్యంగా పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించి మినీగోకులం షెడ్లను మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఈ తతంగాన్ని పక్కన బెట్టి ఇష్టానుసారంగా సర్పంచుల ద్వారా అనర్హులకు షెడ్లు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం అభివృద్ధి పనుల విషయంపై సర్వసభ్య సమావేశంలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు, ఎంఈఓ మోహన్, ఏపీఓ ఓబుళప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, ఏఓ రాజ్యలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, క్షేత్రస్థాయి అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం

లేపాక్షి: మండల కేంద్రంలోని అన్నదాన సత్రం నిర్వహణ కోసం వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన చలంచెర్ల వెంకటరమణారెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి శనివారం రూ. 25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటి సభ్యులు సత్కరించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న బాబావలి

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఐటీఐలో ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తరుణ్, పవన్, హుసేన్, అఫ్రీద్, హుస్సేన్, మంజునాథ్, మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల విడుదల



క్యాలెండర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో శనివారం వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. తాలూకా వైష్ణవ సంఘం కార్యదర్శి పాండు మాట్లాడుతూ.. వైష్ణవులు కేవలం అర్చక వృత్తికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా వైష్ణవ సంఘం అధ్యక్షుడు భీమనకుంటె సంపత్, జిల్లా డైరెక్టర్ దర్శన్, పెమ్మనహళ్లి శ్రీనాథ్ తదితర పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పావగడ: తాలూకాలోని పావగడ ఉపవిభాగం 66–11 కేవీ పరిధిలోని పావగడ, వెంకటాపురం, శైలాపురం, నాగలమడక, మంగళవాడ, వైఎస్ హొసకోట ఉప స్థావరాల్లో త్రైమాసిక నిర్వహణ చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని బెస్కాం ఏఈఈ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అగళి: మండల పరిధిలోని రామనపల్లి శివారులోని పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం ఎస్‌ఐ వీరేష్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు తప్పించుకుని పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వీరేష్ హెచ్చరించారు.

వరి కోత పనుల్లో రైతుల బిజీ



యంత్రంతో వరికోస్తున్న దృశ్యం

రొద్దం: మండల వ్యాప్తంగా వరి కోతల్లో రైతులు బిజీ అయ్యారు. తుఫాను ప్రభావం తగ్గిపోవడంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు చేపట్టారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1,153 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కెంచమాంబ దేవి విగ్రహ ఊరేగింపు

అమరాపురం: గొడనకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కెంచమాంబ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. నూతనంగా తయారు చేయించిన విగ్రహాన్ని ఆదివారం గ్రామంలో ఊరేగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం



శ్రీరంగరాజులపల్లిలో గ్రామోత్సవ దృశ్యం



కొండంపల్లిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గత శుక్రవారం రాత్రి స్థానిక అయ్యప్ప ఆలయంలో పడి పూజ నిర్వహించారు. శనివారం వేకువజామునే ట్రాక్టర్‌పై అరటి మోసులతో అందంగా అలంకరించిన అయ్యప్ప స్వామి చిత్రపటంతో మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు నర సింహప్ప, నారాయణస్వామి, అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల పూజ

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మాలధారుల మండల పూజ శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, బైపురెడ్డి, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

రొళ్ల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలను అరికట్టేందుకు అంగన్‌వాడీ వర్కర్లు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు బాలురకు 21 ఏళ్ల వయస్సు వచ్చే వరకూ వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేయడం, సహకరించడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు కూడా గమనించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా కియా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. అనంతరం 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జూదం, ఇతర కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆదేశించారు. కియా ఎస్‌ఐ రాజేష్,ఏఎస్‌ఐ వెంకటరమణ, సిబ్బంది హాజరయ్యారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించిన దృశ్యం

రొద్దం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని దందేపల్లి పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

నేడు పుస్తకాల ఆవిష్కరణ

పెనుకొండ: పట్టణంలోని వాసవీ ధర్మశాలలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రామావినవేమిరా, భక్తి సుధ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా శనివారం తెలిపారు. పెనుకొండకు చెందిన రామబ్రహ్మం పెనుకొండపై మమకారంతో పుస్తకాలు రచించారని ఆయన తెలిపారు. పుస్తకాల ఆవిష్కరణకు ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, ఆశావాది శశాంకమౌళి, ఏలూరి యంగన్న, విన్నకోట విజయసాగర్, తదితర కవులు, రచయితలు, పట్టణ ప్రముఖులు హాజరవుతారన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హిందూపురం: స్థానిక పేట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ఉదయం మూలవిరాట్ వేంకటరమణస్వామికి పంచామృతాభిషేకాలు చేసి, తిరుమల వేంకటేశ్వరుడిగా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు. అలాగే శనిత్రయోదశిని పురస్కరించుకుని పట్టణంలోని శనీశ్వరాలయాల్లో విశేష పూజలు చేశారు. డీబీ కాలనీ, టీచర్స్ కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు తిల తైలాభిషేకాలు నిర్వహించారు. అలాగే జ్యేష్టదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించి కొలువు దీర్చారు. ఈ సందర్భంగా భక్తులు దీపారాధనలు చేశారు.



తిరుమల వేంకటేశ్వరుడి అలంకరణలో పేట వెంకటేశ్వరస్వామి

వైభవంగా శని త్రయోదశి

పావగడ: పట్టణంలోని శనీశ్వరాలయంలో శనివారం శని త్రయోదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి శనీశ్వరస్వామి, శీతలాంబ దేవికికి అభిషేకాలు, శీతలాంబ దేవికి కుంకుమార్చన చేపట్టారు. అంతకు ముందు భక్తులు ధర్మదీక్ష మంటపంలో తల నీలాలు సమర్పించారు. అనంతరం కోటి ఆంజనేయస్వామికి పూజలు చేశారు.



పావగడలో శనీశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయ స్వామికి పూజలు

అమరాపురం: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఆంజనేయ స్వామికి శనివార భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకులు వివిధ రకాల అభిషేకాలు చేపట్టారు.

పోరుబాట విజయవంతం

- పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట విజయవంతమైందని మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి రాగానే పెంచడం దుర్మార్గమన్నారు. చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. చంద్రబాబును నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని వెల్లడించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని గుర్తు చేశారు. మడకశిరలో పోరుబాటను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

- ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్

మడకశిర: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. జీఓ 117 రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ చైర్మన్ నియమించాలని తెలిపారు. పదోన్నతుల ద్వారా ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు.

ఏపీఎస్‌టీఏ మండల కార్యవర్గం ఎన్నిక



సురేష్‌గౌడ్



రమేష్

మడకశిర: పట్టణ పరిధిలోని మాళేరొప్పం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏపీఎస్‌టీఏ (ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు మారుతి ప్రసాద్, కోశాధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మడకశిర మండల అధ్యక్షుడిగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశ్వత్థ నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విష్ణు, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా నాగరాజాచారి, కోశాధికారిగా నరసింహ మూర్తి, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నరసింహమూర్తి, లక్ష్మీనరసమ్మ, ఇమ్రాన్‌ఖాన్ పాటు మరో 15 మంది మండల కార్యదర్శులను ఎన్నుకున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ప్రేరణనిస్తుంది

హిందూపురం: సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం ప్రేరణ కల్గిస్తుందని ప్రిన్సిపాల్ నాగమణి అన్నారు. స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 7, 8, 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సీఎస్ఆర్ యాక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా డి.భగవతి జ్యోష్ణ, భువనేశ్వరి, మేఘవర్షిని ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కూల్‌డ్రింక్స్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శంకర్

లేపాక్షి: అధిక ధరలకు సరకులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం లేపాక్షిలోని జాతాయువు థీమ్ పార్కు సమీపంలో నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీములు, చెరుకు రసానికి సంబంధించిన దుకాణాలను తనిఖీ చేశారు. కిరాణా షాపుల్లో ప్రతి వస్తువుపై రూ.5 అదనంగా వసూలు చేయడంపై ఆయన ఆరా తీశారు. పద్ధతి మార్చుకోవాలని దుకాణాల యజమానులపై మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పురావృతం అయితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.